# హేరామ్ ! ట్రాఫిక్ జామ్ !

ఈమధ్యన మన అందమైన నగరంలో తరచు ట్రాఫిక్ జామయిపోతోంది. కారణాలు అనేకం. వాటిల్లో ముఖ్యమైనది బస్సులు, లారీ డ్రయివర్లకి ట్రాఫిక్ సెన్స్ లేకపోవటం. వెడుతున్న లారీ మధ్యలో మనసు మార్చుకుని వెనక్కి తిరగాలని ప్రయత్నం చేస్తుంది. కాని లెక్క తప్పటంతో అటూవెనక్కిపోలేక, ముందుకి రాలేక రోడ్డుకి గోడకట్టినట్లు నిలబడిపోతుంది. ఆవైపు ఈవైపు భారీ వాహనాల దగ్గిర నించి , సైకిలు రిక్షాల దాకా నిలబడిపోతాయి. హారన్లు, హడావుడి , గొడవ , గందరగోళం , ఎవరికి వారే ఎలాగో అలాగ ఆ రొచ్చులోంచి బయటపడాలని తాపత్రయం . కాని ప్రయత్నం ఫలించకపోగా దోవ మరింత మూసుకుపోతుంది. ఆఫీసులకెళ్ళేవాళ్ళు ఈ ట్రాఫిక్ జామ్లలో గాని ఇరుక్కుంటే వాళ్ళ పనంతే ! వాళ్ళని పరమేశ్వరుడే కాపాడాలి.

ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయి గంటో, రెండు గంటలో ఆలస్యంగా ఆఫీసుకెడితే ఆఫీసరు సహృదయంతో అర్థం చేసుకోవచ్చు గాని, పురిటినెప్పులతో వెడుతున్న గర్భిణీ స్త్రీ ట్రాఫిక్ జామయింది కాస్సేపు ఓపికి పట్టమని పుట్టబోతున్న శిశువుకి చెప్ప గలదా ? జననాన్ని ఆపగలదా ? అలాగే కోర్టు వాయిదాకి టైంలో వెళ్ళలేకపోవటంతో ఎక్స్‌పార్టీగా నిర్ణయించి కేసుకొట్టేస్తాం అనంటే, యువ్‌రానర్ – నే మూడుగంటలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాను, అంచేత కేసుని మళ్ళీ మొదలెట్టమంటే, జడ్జిగారు వింటారా ? నథింగ్ డూయింగంటారు. అలాగే ఇంటర్వ్యూల కెడుతున్నవాళ్ళు గూడా.

ఒక్కోసారి జీవితంలో ప్రతి నిమిషం చాలా అమూల్యం అనుకునే పరిస్థితులొస్తుంటాయి. మరి అలాంటి సమయంలో మనం ఈ జామ్‌రాక్షసి పిడికిళ్ళలో ఇరుక్కుపోతే మనకేది దారి ! ఈమధ్యన ఒకళ్ళింట్లో పెళ్ళి చూపుల కార్యక్రమం ఏర్పాటుచేసుకున్నారు. పిల్ల కూడా ఉద్యోగస్తురాలు కావటంతో పెళ్ళివార్ని తొమ్మిదిలోపు రమ్మని రిక్వెస్టు చేస్తే – వాళ్ళు నోప్రాబ్లం అన్నారట. వాళ్ళు అన్ని ఏర్పాట్లు చేసుకుని సిద్దంగా కూర్చున్నారు. ఎనిమిది.....తొమ్మిది....పది.... పెళ్ళివారు రాకపోవడంతో పిల్లాడికి మార్కెటు వేల్యూ పెరిగుంటుంది, అంచేత మనసు మార్చుకోనుంటారని భాష్యం చెప్పుకుని తల్లి, తండ్రి , పిల్ల అంతా ఇల్లు తాళం వేసి ఎవరి ఆఫీసుకి వాళ్ళు

వెళ్ళిపోయేరట. పదకొండు గంటలకి పెళ్ళివారొచ్చేరు. తాళం చూసి పిల్లకి ఆ పిట్టల్లంక సంబంధం ఖాయం చేసుకునుంటారు, అంచేతనే మొహం చాటేశారని వేరే సంబంధం చూట్టానికి ప్రొసీడయిపోయారట. ఇంతకీ – ఆరోజు ఆటో డ్రయివర్ని పోలీసు కానిస్టేబుల్ ఏదో అన్నాట్ట. దాంతో ఆటోవాళ్ళంతా వాహనాలని రోడ్డుకి అడ్డదిడ్డంగా ఎక్కడికక్కడ ఆపేసి ట్రాఫిక్కుని స్థంభింపజేశారు. మన మొగ పెళ్ళివారు ఆ జామ్‌లో జమయిపోయారు. పెళ్ళికాస్తా తప్పిపోయింది. ఇలాంటి సంఘటనలు ఎన్నో !

ఈ ట్రాఫిక్ జాములకి కారణం మనమే ? అసలు మనకి ట్రాఫిక్ సెన్స్ లేనేలేదు. ఎంతసేపూ దూసుకుపోదాం అనే తొందర తప్ప కొన్ని రూల్సు రెగ్యులేషన్స్ వున్నాయి. వాటిని మనకోసం, మనలాంటి వాళ్ళందరికోసం ఫాలో అవ్వాలన్న జ్ఞానం లేదు. సైకిలు వాడికి బస్సు వాడితో ఫోటీ. ఆటోవాడికి లారీవాడితో పందెం. సైకిలు వాడికి అస్సలెవ్వరితోనూ పందేలు, పోటీలు, సంబంధాలు వుండవ్.... తనొక ప్రత్యేక తరహా శాల్తీనని భావించుకుని , వాయువేగ, మనోవేగంతో బస్సుల్ని, లారీల్ని , అవలీలగా తప్పించుకుంటూ సర్కస్ చేస్తున్న ధోరణిలో దోసుకుపోతుంటాడు. ఊరేగింపులు, ప్రదర్శనలు, రోడ్లపైన ధర్నాలు, మీటింగులు జరిగిపోతూ వుంటాయి. ట్రాఫిక్కు ఆగిపోతుంది. లేదూ, మంత్రిగారి కారొస్తుందంటే పావుగంట ముందే ట్రాఫిక్ ఆపేస్తారు. యథాస్థితికి రావటాకి గంటపైగా పడుతుంది. పోలీసులు మాత్రం ఎంతకని చెయ్యగలరు !ట్రాఫిక్ సిగ్నల్సు పెట్టారు. జీబ్రా గీతలు గీశారు ! సాక్షాత్తు ట్రాఫిక్ పోలీసుల్ని వేశారు. అయినా స్థంభించిపోతుంటే వాళ్ళేం చేయగల్రు ! నగర జీవితాల్లో ఈ ట్రాఫిక్ జామ్‌లు సాధారణమే అయినా, వీటి నివారణకి, వీటి బారినుంచి బయట పడడానికి ప్రతి ఒక్కరూ ఏదైనా మార్గం వుందేమో ఆలోచించాల్సిన అవసరం ఎంతయినా వుంది. మన అమూల్యకాలాన్ని నడి రోడ్డుపైనే ట్రాఫిక్ జామ్ వృధా చేయటం సహింపరాని సంగతి. ఆ పరిస్థితి రాకుండా చేయగలిగితే నగరవాసులు నిజంగా ధన్యజీవులే మరి !

------- అయ్యిపోయింది -------